క్లుప్తంగా

సన్మానం



ఖానాపురం : ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న సందర్భంగా స్థానిక ఎస్సై రఘుపతిని మండలంలోని బుధరావుపేటకు చెందిన కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడారు. విధి నిర్వహణలో, శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్సై ప్రతిభకు గుర్తింపుగా అవార్డు రావడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పసునూరి వెంకన్న, రామస్వామి, శ్రీను, సునీల్, నర్సయ్య, వినోద్ కుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి..



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రావు ఉత్తమ ఉద్యోగిగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్న క్రమంలో ఆయన్ను స్థానిక నాయకులు సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు కత్తి కిరణ్‌కుమార్ మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శిగా నాగేశ్వర్‌రావు అందించిన సేవలకు గుర్తింపుగా అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు విధినిర్వహణలో సమర్థవంతంగా పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు అయిలోని అశోక్, ఇట్టబోయిన వెంకటయ్య, వీఓఏ పిండి శ్రీనివాస్, కత్తి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ శివారులోని డ్యాం వద్ద పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్సై రఘుపతి మీడియాకు వివరాలు వెల్లడించారు. పేకాడుతున్న నర్సంపేటకు చెందిన లక్క శ్రీధర్, ఆరెపలఇల రవి, పొన్నం శ్రీను, అన్న ఏకాంబ్రంలను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.23 వేల 570 నగదుతోపాటు 5 సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్‌కు చెందిన గొర్రెకుంటలో యువకులకు మనుగొండకు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాల కిశోర్‌రెడ్డి సొంత డబ్బుతో వాలీబాల్, షటిల్ సామగ్రితోపాటు ఎల్‌ఈడీ లైట్లను సమకూర్చారు. ఆయన సమకూర్చిన క్రీడా సామగ్రిని యువకులకు స్థానిక నాయకులు అల్లం మర్రెడ్డి, వీరగోని రాజ్‌కుమార్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మర్రెడ్డి, రాజ్‌కుమార్ మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. బాలకిశోర్‌రెడ్డి యువతకు అండగా ఉంటారని చెప్పారు.

నియామకం



శ్రీనివాస్

వర్ధన్నపేట : మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన ఈరెల్లి శ్రీనివాస్ మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్ కుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. మాదిగ ప్రజలకు 12 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పోరాటాలు నిర్మిస్తామన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నర్సంపేట : హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2న తలపెట్టిన బీసీ రాజకీయ యుద్ధభేరి సభ వాల్‌పోస్టర్లను పట్టణంలోని సర్వాయి పాపన్న విగ్రహం వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సోల్తి సారయ్య, బీసీ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి మాట నిలుపుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్‌తో బీసీలకు తీరని అన్యాయం జరగనుందన్నారు. ఈడబ్ల్యూఎస్‌ను రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక బీసీ పవర్ జిల్లా ప్రతినిధి, మాజీ కౌన్సిలర్ మండల శ్రీనివాస్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు గండు రవి, బీసీ పవర్ యువజన నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గొల్లగూడెంతండాలో తాగునీటి కష్టాలు

● సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

ఖానాపురం : మండలంలోని గొల్లగూడెంతండాలో తాగునీటి కష్టాలతో ప్రజలు సతమతమవుతున్నారు. సమస్య పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తండాలో 210 మంది జనాభా ఉండగా వీరి కోసం 3 చేతి పంపులు, ఒక బోర్ ఏర్పాటు చేసి మిషన్ భగీరథ కనెక్షన్ ఇచ్చారు. కాగా మూడు చేతిపంపులు చెడిపోయి పని చేయని దుస్థితి నెలకొంది. బోర్ సైతం అందుబాటులోకి రాలేదు. మిషన్ భగీరథ కనెక్షన్ల ద్వారా నీరు సన్నటి ధారలా వస్తుండడంతో తండావాసులు నీరు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలం రాకముందే తాగునీటికి గోస పడుతున్నామని తండావాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని తండావాసులు మీడియా ఎదుట వాపోయారు. విచారణ కోసం డివిజన్ స్థాయి అధికారులు తండాకు వచ్చి పరిశీలించి వెళ్లినా పరిష్కారానికి అడుగులు పడడం లేదంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తండాలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



చెడిపోయిన చేతిపంపు



పని చేయని బోర్‌పై కప్పిన బకెట్

నూతన బోర్ వేయిస్తాం

గొల్లగూడెంతండాలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం వాస్తవమే. చేతిపంపులు, బోర్ పని చేయడం లేదు. త్వరలో నూతన బోర్ వేయించి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– రవి, పంచాయతీ కార్యదర్శి, బోటిమీదితండా

వీఓఏల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

● సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మాధవి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి

నర్సంపేట : గ్రామీణ ప్రాంతాల్లో మహిళ సంఘాల బలోపేతానికి ఎనలేని కృషి చేస్తున్న వీఓఏల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వీఓఏల సంఘం (బీఆర్‌టీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షురాలు మారపల్లి మాధవి అన్నారు. మండలంలోని గ్రీన్ రిసార్ట్‌లో జిల్లా అధ్యక్షుడు పోలుదాసరి రమేశ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వీఓఏలు ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా మహిళా సంఘాలను చైతన్యవంతం చేసే దిశగా అవిశ్రాంతంగా పని చేస్తున్నారని చెప్పారు. కనీస వేతనం, ఇన్సూరెన్స్, తదితర సమస్యలతో వీఓఏలు సతమతమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీఓఏల సేవలను గుర్తించి వారికి కనీస వేతనం రూ.26 వేల చొప్పున ఇవ్వాలని, ఇన్సూరెన్స్ కల్పించాలని, సెర్ప్ నుంచి ఐడీ కార్డులతోపాటు యూనిఫాం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు మాట్లాడుతూ వీఓఏల సమస్యల పరిష్కారానికి పోరాటాలు తప్పవన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామన్న హామీని విస్మరించి మహిళా చైతన్యంలో భాగస్వాములవుతున్న వీఓఏలను సైతం నిర్లక్ష్యం చేస్తోందంటూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి కరుణ, కోశాధికారి ఏకాంబరం, కమిటీ సభ్యులు యాకస్వామి, రాధిక, రాణి, మహేందర్, శ్రీలత, నిర్మల, స్రవంతి, లక్ష్మణ్, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ సాధనే ధ్యేయం



బీసీ ఆజాదీ సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న డాక్టర్ గాదె ఎల్లయ్య

● ఆర్ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్

పర్వతగిరి : బీసీలకు రిజర్వేషన్ సాధనే ధ్యేయంగా ఫిబ్రవరి 2న హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీలో బీసీ రాజకీయ యుద్ధభేరి మహాగర్జన బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రజక రిజర్వేషన్ పోరాట సమితి (ఆర్ఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చావర్తి కుమార్ గాడ్గే, బీసీ ఆజాదీ సైకిల్ యాత్ర కన్వీనర్ బత్తుల సిద్దేశ్వర్ పటేల్ తెలిపారు. ఆ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర మండల కేంద్రానికి సోమవారం చేరుకుంది. ఈ సందర్భంగా కుమార్, సిద్దేశ్వర్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 2న తలపెట్టిన సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మండల కేంద్రం నుంచి ప్రారంభమైన సైకిల్ యాత్రను డాక్టర్ గాదె ఎల్లయ్య జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో హిందూ బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతం సతీశ్, అంబేడ్కర్ సంఘం నాయకుడు కొంగర నరహరి, మాదిగ దండోరా నాయకులు కుంటి విజయ్‌కుమార్, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు కోట్ల వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డుతో రైతులకు లబ్ధి

● బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

దుగ్గొండి : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డుతో రైతులకు లబ్ధి చేకూరుతుందని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీవీ.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని గొల్లపల్లిలోని మల్లికార్జున గుప్తా వ్యవసాయ క్షేత్రంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు, బ్యాంకర్ల మధ్య సమన్వయం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఆశించిన ఫలితాలు రావడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. గ్రామీణ ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధిస్తేనే దేశం బాగుపడుతుందని చెప్పారు. బ్యాంకుల సహకారం ఉంటేనే వ్యవసాయం సవ్యంగా సాగుతుందన్నారు. కొందరు బ్యాంకర్లు రైతులకు అందించే రుణాలను కిసాన్ క్రెడిట్ కార్డులు ఇచ్చినట్లు చూపుతుండడం సరికాదన్నారు. రైతులకు అవగాహన లేక నష్టపోతున్నారని చెప్పారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పొందే రుణాన్ని కేంద్ర ప్రభుత్వం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచిందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న రైతులు నేరుగా బ్యాంకుల్లో లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని కార్డులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర పంటల బీమా ప్రముఖ్ భూమారెడ్డి, జిల్లా బ్యాంకింగ్ ప్రముఖ్ తోట మల్లికార్జున్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యం



రాయపర్తి : ప్రజలకు సామాజిక సేవలు అందించడమే తమ కుటుంబ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. ఆమె భర్త రాజా రామ్మోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా మండలంలోని కొండాపురంలో మాదారపు అశోక్, స్థానిక నాయకులు సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం మండలంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పోలీసు శాఖకు లక్ష రూపాయల చెక్కు అందజేశారు. తొలుత రుక్మిణి సత్యభామల సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సంగెం : విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండలంలోని గవిచర్ల గ్రామంలోని విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో సంఘం జిల్లా అధ్యక్షుడు బండ్లోజు నర్సింహాచారి ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం నర్సింహాచారి మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులు ఆర్థిక, సామాజిక, ఇతర అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారని ఆందోళన వెలిబుచ్చారు. హక్కుల సాధనకు విశ్వబ్రాహ్మణులు ఏకతాటిపైకి రావాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలని రాజకీయ పార్టీలను కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కనపెల్లి సతీశ్‌కుమార్, కోశాధికారి సదాశివుడు, మండల అధ్యక్షుడు కాగితాల జగన్నాధచారి, ప్రధాన కార్యదర్శి కోదండరాములు, నాయకులు ప్రసాద్, రాజు, శ్రీనివాస్, శ్రీధర్, ప్రశాంత్, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



‘మిషన్ భగీరథ’కు లీకేజీ

మండలంలోని గిర్నిబావిలో మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై నీరు వరదలా ప్రవహిస్తోంది. లీకేజీ ఏర్పడి రెండు నెలలు గడచినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోజూ ఉదయం 10 గంటల వరకు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. – వరంగల్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
మంగ్యానాయక్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్
ఫోన్‌నంబర్ : 9676392259

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థులు బండారి రిషి, అలువాల రిషిత ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం జయ తెలిపారు. పాఠశాల ఆవరణలో ఇద్దరు విద్యార్థులతోపాటు పీఈటీ వీరగోని స్వప్నను సోమవారం హెచ్ఎం అభినందించి మాట్లాడారు. 7వ తరగతి చదువుతున్న రిషి, 8వ తరగతి విద్యార్థి రిషిత ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటినట్లు తెలిపారు. మెదక్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, రాగి శ్రీధర్, సంతోశ్‌కుమార్, పిన్నింటి బాలాజీ రావు, ఉదయ్‌కుమార్, మాధవి, మొగిలి, సుందర్, మాధవి, సతీశ్‌కుమార్, రమాదేవి, హంస రామకృష్ణ, జాహెద్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చెన్నారావుపేట : నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లికి చెందిన రంజిత్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు. ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. మండలంలోని మగ్దుంపురంలోని జయముఖి కళాశాల సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రంజిత్‌కుమార్‌తోపాటు మహబూబాబాద్ జిల్లా పరిధిలోని కొత్తగూడ మండలంలోని కార్లాయికి చెందిన కొట్టం కుమారస్వామి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో కుమారస్వామి సతీమణి స్వరూప ఫిర్యాదు మేరకు రంజిత్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

వేతనాలు పెంచాలని వినతి

నర్సంపేట : తమకు వేతనాలు పెంచాలని కోరుతూ స్థానిక మున్సిపల్ వాటర్ సప్లై కార్మికులు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాషుక్, నాయిని సతీశ్ తదితరులు మాట్లాడారు. జీఓ నంబర్ 14, జీఓ నంబర్ 60 ద్వారా వేతనాల పెంచాల్సి ఉందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్మికులు గంగారపు ప్రకాశ్, గూడెపు సూరయ్య, జి.నరేందర్, రాజశేఖర్, నాతి రాజు, వేమ రంజిత్, తదితరులున్నారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్క రాజును అతడి తల్లి ఇటీవల మృతి చెందిన క్రమంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, నాయకులు తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, పెండెం రామానంద్, తదితరులున్నారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని ఊకల్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బండపల్లి వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందగా అతడి మృతదేహానికి మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మధు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎలమంచి శ్రీనివాస్‌రెడ్డి, గొల్లపల్లి సదాశ్రీను, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాల్లో దైవజ్ఞానం



గ్రంథాలను అందజేస్తున్న జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, తదితరులు

● వేదిక జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి

ఖానాపురం : యోగి వేమన రాసిన పద్యాల్లో దైవ జ్ఞానం ఉందని త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ అధ్యక్షురాలు కృష్ణవేణి తెలిపారు. ఆమె ఆధ్వర్యంలోని బృందం మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలో వేమన పద్యాల సారంతో కూడిన ‘నిగూఢ తత్వార్థ బోధిని, త్రైత సిద్ధాంత భగవద్గీత’ గ్రంథాలను సోమవారం ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడారు. త్రైత సిద్ధాంత ఆదికర్త, ఇందూ జ్ఞాన ప్రదాత ఆచార్యప్రబోధానంద యోగీశ్వరులు రచించిన నిగూఢ తత్వార్థ బోధిని గ్రంథంలో 110 వేమన పద్యాలక ఆధ్యాత్మిక వివరణ ఇచ్చారని చెప్పారు. వేమన పద్యాలలోని జ్ఞానాన్ని సమాజంలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. హిందువులందరూ నిగూఢ తత్వార్థ బోధిని, త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను అధ్యయనం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు లలిత, సుష్మ, హేమలత, స్వరూప, రేఖ, కృష్ణ, కాలయుక్తి, ఈశ్వర్, సుజాత, వీరస్వామి, వంశీకృష్ణ, వీరలక్ష్మి, ఇందు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకు పౌష్టికాహారం తప్పనిసరి

● డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశ్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రకాశ్

నర్సంపేట రూరల్ : గర్భిణులు, బాలింతలు ఆరోగ్య పరిరక్షణ కోసం తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశ్ కోరారు. నర్సంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఐటీసీ ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా సహకారంతో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ‘అయోడిన్ లోపం, రుగ్మతలు’ అంశంపై ఆశ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అయోడిన్ లోపంతో గర్భిణులు, బాలింతలు, బాలికలు రుగ్మతల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పెరటి తోటల్లో సీజనల్‌గా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. కేఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దయాకర్ మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల థైరాయిడ్, గాయిటర్, తదితర అనారోగ్య పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలంటే గర్భిణులు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డాక్టర్ అరుణ్‌చంద్ర, సీహెచ్ రాజేంద్ర, జయరాజ్, వసంత, సరోజన, నవీన్‌చంద్ర, ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ నల్లబెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజ ఉన్నతిలో మహిళలు కీలకం

● ఎస్‌బీఐ మేనేజర్ రమేశ్



బహుమతి అందజేస్తున్న మేనేజర్, తదితరులు

నర్సంపేట : సమాజ ఉన్నతిలో మహిళలు కీలకమని స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ రమేశ్ అన్నారు. ప్రతిభ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో మగ్గం, టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు ఆటల పోటీలు నిర్వహించగా విజేతలకు సంస్థ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మేనేజర్ రమేశ్ బహుమతులు అందజేసి మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడంతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందని, ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. సీడీపీఓ మధురిమ, అటవీ శాఖ అసిస్టెంట్ రేంజ్ ఆఫీసర్ రీనా మాట్లాడుతూ మహిళలు మగ్గం, టైలరింగ్, తదితరాల్లో శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందాలని సూచించారు. తద్వారా ఆర్థిక స్వావలంబన సాధించి పురుషులకు దీటుగా వ్యాపారాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఠాకూర్ రతన్‌సింగ్, హన్మకొండ విజిలెన్స్ కమిటీ సభ్యులు బండా కాళిదాసు, సర్వేశం, శ్రీనివాస్‌రెడ్డి, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

‘పాత పెన్షన్’ పునరుద్ధరించాలి



చెన్నారావుపేట: వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఉమామహేశ్వర్, పాత శ్యాంప్రసాద్, ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శి నాగేందర్ సింగ్, ఉపాధ్యక్షులు పోలెపల్లి రవి, సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ యూనియన్ మండల కమిటీల ఆధ్వర్యంలో నర్సంపేట, వర్ధన్నపేట, చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో తహసీల్దార్లకు నాయకులు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్, శ్యాంప్రసాద్, ఈశ్వర్, రవి, సుధాకర్‌రెడ్డి, పురాం భద్రీనాథ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాలతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమాల్లో ఆ యూనియన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మోతె ఇంద్రసేనారెడ్డి, మండలాల అధ్యక్షులు నక్కిరెడ్డి మహేందర్‌రెడ్డి, కోడెం సాంబయ్య, మనుజేందర్ రెడ్డి, పోలోజు భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

తల్లికి తలకొరివిపెట్టిన కూతురు



చెన్నారావుపేట : మండలంలోని చెరువుకొమ్ముతండాకు చెందిన భూక్య లక్ష్మి (68) సోమవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమెకు పెద్ద కుమార్తె రజిత తలకొరివి పెట్టింది. లక్ష్మి భర్త ఆరేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు కుమారులూ లేరు. ఈ క్రమంలో కుమార్తెలు తల్లికి తలకొరివి పెట్టడం గిరిజన సాంప్రదాయానికి విరుద్ధమని పెద్దలు చెప్పగా మృతురాలి కుమార్తెలు అంగీకరించలేదు. మారుతున్న సమాజ పరిస్థితుల్లో తప్పుకాదంటూ లక్ష్మి మృతదేహానికి రజిత తలకొరివి పెట్టింది.

గ్రామానికి సోలార్ ప్రాజెక్టు కేటాయించాలి

దుగ్గొండి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కుసుమ్ పథకం కింద మండలంలోని తిమ్మంపేటకు సోలార్ పవర్ ప్రాజెక్టును కేటాయించాలని మాజీ సర్పంచ్ మోడెం విద్యాసాగర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకుడు దొనపాటి జనార్దన్‌రెడ్డితో కలిసి ఆయన జిల్లా కలెక్టర్ సత్యశారదకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం విద్యాసాగర్ మాట్లాడారు. పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు గ్రామంలో అనుకూలమైన వాతావరణం ఉందని చెప్పారు. ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే మహిళా సంఘాలు బలోపేతం కావడంతోపాటు నిరుద్యోగులకు ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు.